క్లుప్తంగా

మారెమ్మకు పూజలు

ప్రొద్దుటూరు : మైలవరం మండలం కంబాల దిన్నెలో మారెమ్మ ఆలయాన్ని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, ఆయన సతీమణి రాచమల్లు రమాదేవి సందర్శించారు. ఆలయ నిర్వాహకులు ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు. ఎమ్మెల్యే దంపతులచే అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దంపతులను శాలువా కప్పి నిర్వాహకులు సత్కరించారు.

ఓబీసీ విభాగ కార్యవర్గం నియామకం

మైదుకూరు : బీజేపీ ఓబీసీ విభాగం మండల కార్యవర్గాన్ని ఆదివారం నియమించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆ విభాగం మండల అధ్యక్షుడుగా వడ్ల దేవేంద్ర, కార్యదర్శిగా డి.ఓబులేసులను నియమిస్తూ బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాచనూరు సుబ్బరాయుడు వారికి నియామక పత్రాలను అందించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆర్.రామకృష్ణ పాల్గొన్నారు.

పోలవరం ఎత్తును కుదించొద్దు

ప్రొద్దుటూరు : రాష్ట్ర ప్రజలకు జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు ఎత్తును కుదించొద్దని సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బి.రామయ్య డిమాండ్ చేశారు. ఆదివారం ఓ ప్రైవేటు పాఠశాలలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పోలవరం ఎత్తును కుదిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం ప్రశ్నించకపోవడం సరికాదన్నారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తును తగ్గించడం వల్ల రాయలసీమ ప్రాంతంలో సాగునీటి సమస్య ఏర్పడుతుందని తెలిపారు. గతంలో అనుమతించిన మేరకు ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని ఆయన కోరారు. ఈ విషయమై ఈనెల 27, 28 తేదీల్లో కలెక్టరేట్ వద్ద దీక్షలు నిర్వహిస్తున్నామని, రైతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఐ ఏరియా కార్యదర్శి పి.సుబ్బరాయుడు, సహాయ కార్యదర్శి షరీఫ్, సభ్యులు యేసోబ్, చంద్రశేఖర్, ప్రతాప్, శ్రీను, నారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత ముఖ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని వేదవ్యాస డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ ఎల్.నాగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని దొరసానిపల్లెలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రెండవ రోజైన ఆదివారం విద్యార్థులు ప్లాస్టిక్, హానికర వ్యర్థాలను తొలగించి వాటిని చెత్త కుండీలలో వేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రెసిడెంట్ సుదర్శన్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు రామలక్ష్మిరెడ్డి, నాగరాజ, యాసిన్ అధ్యాపకులు పాల్గొన్నారు. స్థానిక ఎస్వీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఆదివారం రామేశ్వరంలోని త్రాగునీటి కుళాయిల వద్ద శాంపిల్స్ సేకరించి టీడీఎస్ పరిశీలించారు కార్యక్రమంలో అధ్యాపకుడు దామోదర రావు, ఎన్‌సీసీ ఆఫీసర్ ప్రదీప్, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

అండర్-17 టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు

మైదుకూరు : మైదుకూరులో ఆదివారం అండ్-17 టెన్నిస్ బాల్ బాలికల, బాలుర క్రికెట్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన జట్లు వచ్చే నెల 21, 22 తేదీల్లో అనంతపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని నిర్వాహకులు తెలిపారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రం ప్రారంభోత్సవంలో సీఐ నారాయణ యాదవ్, ఎంవీఐ నారాయణ నాయక్

ప్రొద్దుటూరు : స్థానిక కొర్రపాడు రోడ్డులోని పాత బస్టాండర్‌లో లైట్ మోటార్ వెహికల్స్ ఓనర్స్, డ్రైవర్స్ ట్యాక్సీ స్టాండ్ అసోసియేషన్ వారు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం త్రీటౌన్ సీఐ నారాయణ యాదవ్, ఎంవీఐ నారాయణ నాయక్ ప్రారంభించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు ఇమాం హుసేన్, నాగేశ్వరరావు, మున్నా, మాలిక్, నాగరాజు నాయుడు, అజయ్, రాముడు, రాజేష్, రవి, పుష్పరాజు, హరి, సంజీవరాయుడు, వెంకటశివ, రామకృష్ణ, ఎలీషా పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

గోపవరం : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం బేతాయపల్లె గ్రామ సచివాలయం పరిధిలో మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్నట్లు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ గోపవరం మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు పాల్గొంటారని అన్నిశాఖల అధికారులు, సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం ఉంటుందని, తర్వాత గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. అన్నిశాఖల అధికారులతో పాటు వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

వైఎస్సార్ ఆసరాతో పేదలకు అండ

బద్వేలు : వైఎస్సార్ ఆసరా కార్యక్రమంతో పేద మహిళలకు అండగా నిలుస్తున్నామని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పోరుమామిళ్లలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రజాసంకల్పయాత్రలో ఇచ్చిన హామీ మేరకు డ్వాక్రా సంఘాల మహిళలకు సున్నా వడ్డీని ఖాతాల్లో జమ చేస్తున్నారన్నారు. బద్వేలు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో వైఎస్సార్ ఆసరా చెక్కులను డ్వాక్రా మహిళలకు అందించేందుకు వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. డ్వాక్రా రుణమాఫీతో పాటు సున్నావడ్డీని మహిళల ఖాతాల్లో జమ చేస్తూ వారి అభివృద్ధికి సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చి సంక్షేమ పథకాల ద్వారా



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

ముందుకు సాగుతున్నారన్నారు. ప్రస్తుత ఏడాదికి సంబంధించి ఇప్పటికే సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను కూడా తమ ప్రభుత్వం విడుదల చేసిందని, రానున్న మార్చిలోపు వీటన్నింటిని పూర్తి చేసేలా ముందుకు సాగుతున్నామన్నారు.

సోమవారం (నేడు) ఉదయం 9-30 గంటలకు అట్లూరు మండలంలో మహిళలకు చెక్కులు అందజేత, 28న గోపవరం, 29న బద్వేలు, ఏప్రిల్ 1న కలసపాడు, 2వ తేదీన పోరుమామిళ్ళ, 3వ తేదీన కాశినాయన, 4వ తేదీన బద్వేలు మున్సిపాలిటీ, 5వ తేదీన బి.కోడూరు మండలాల్లో డ్వాక్రా చెక్కుల పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయా మండల కేంద్రాల్లో జరిగే ఈ కార్యక్రమానికి హాజరు కావాలని వారు కోరారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ కల్లూరు రమణారెడ్డి, నాయకులు హనుమంతరెడ్డి, పంగా గురివిరెడ్డి, వెంకటరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం లాంటిది

బద్వేలు అర్బన్ : ఆపదలో ఉన్న నిరుపేదలకు సీఎం సహాయనిధి వరం లాంటిదని మున్సిపల్ చైర్మన్ వాకమళ్ళ రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 30వ వార్డులోని పంగావాండ్లపల్లెకు చెందిన విజయలక్ష్మి, నరసింహారెడ్డి దంపతులకు మంజూరైన రూ.1.20 లక్షల చెక్కును ఆదివారం పంగావాండ్లపల్లెలో బాధిత కుటుంబ సభ్యుడికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక లోటులో ఉన్నప్పటికీ ఏ ఒక్క పేద, మధ్యతరగతి ప్రజలు ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశ్యంతో దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి సహాయం చేస్తున్నారన్నారు. కుటుంబ పెద్దను కోల్పోయిన, అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు ఆర్థికంగా



బాధిత కుటుంబ సభ్యుడికి సీఎం సహాయనిధి చెక్కును అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్

నిలదొక్కుకునేందుకు ఎంతగానో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ కన్వీనర్ యద్దారెడ్డి, వార్డు ఇన్‌చార్జిలు చెన్నకృష్ణారెడ్డి, రఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రణాళికబద్ధంగా చదవాలి

దువ్వూరు : విద్యార్థులు ప్రణాళికబద్ధంగా చదవాలని మండల విద్యాశాఖాధికారి శివజ్యోతి పేర్కొన్నారు. మండల కేంద్రమైన దువ్వూరులో పదో తరగతి విద్యార్థులకు ఆదివారం వీడ్కోలు సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు ప్రణాళికబద్ధంగా ఉపాధ్యాయులు చెప్పిన పాఠ్యాంశాలను చదవాలని, సలహాలు, సూచనలు పాటిస్తే మంచి మార్కులు సాధించవచ్చని తెలిపారు. విద్యార్థులు పరీక్షలన్న భయాన్ని విడనాడాలని సూచించారు. అనంతరం ఎస్ఐ రాఘవేంద్రారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు బట్టీ విధానానికి స్వస్తి చెప్పాలన్నారు.



మాట్లాడుతున్న ఎంఈఓ శివజ్యోతి

కార్యక్రమంలో మేధా విద్యాసంస్థల కరస్పాండెంట్ చెన్నంశెట్టి నరసింహులు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు మస్తాన్‌వలి, లోకేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా కల్లూరు జెడ్పీ హైస్కూల్ వార్షికోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్ : మండలంలోని కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని ప్రధానోపాధ్యాయుడు సురేష్‌బాబు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వైఎస్సార్‌సీపీ జిల్లా పంచాయతీరాజ్ కన్వీనర్ వల్లూరు నాగేంద్ర మాట్లాడుతూ ప్రభుత్వం నాడు-నేడు ద్వారా పాఠశాలలో అన్ని వసతులను కల్పించినట్లు తెలిపారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత ఉద్యోగాలు పొంది తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తేవాలని కోరారు. కల్లూరు పీహెచ్‌సీ డాక్టర్ మహాలక్ష్మి మాట్లాడారు. ఈ ఏడాది రాష్ట్ర, జాతీయ స్థాయిలో యునైటెడ్ స్కూల్ ఆర్గనైజేషన్ నిర్వహించిన ఆన్‌లైన్ జనరల్‌నాలెడ్జ్ పరీక్షలో ప్రథమ స్థానం సాధించిన 8వ తరగతి విద్యార్థి



విద్యార్థినికి బహుమతి అందిస్తున్న వల్లూరు నాగేంద్రారెడ్డి

దినేశ్వర్‌రెడ్డికి గోల్డ్‌మెడల్, సర్టిఫికెట్ అందించారు. ఎన్ఎంఎంఎస్‌కి ఎంపికైన 8వ తరగతి విద్యార్థిని ప్రణీతను అభినందించారు. సచివాలయ వీఆర్‌ఓ బాదుల్లా, పేరెంట్స్ కమిటీ చైర్మన్ వెంకటసుబ్బయ్య, రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు శేషశర్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

30న సీతారామ కల్యాణం

చాపాడు : మండల కేంద్రమైన చాపాడులోని శ్రీ ఆత్మారామస్వామి దేవాలయ సన్నిధిలో ఈ నెల 30న సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. శ్రీరామ నవమి పండుగ ఉదయం 11.55 గంటలకు సీతారాముల కల్యాణోత్సవం జరిపి, సాయంత్రం ఊర్మిళ కోలాట బృందం నృత్యంతో కోలాటం నడుమ స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

31 నుంచి బ్రహ్మోత్సవాలు

చాపాడు : మండలంలోని చియ్యపాడు గ్రామంలోని వెలసిన శ్రీ కోదండ రామ స్వామి వారి సన్నిధిలోని ఈ నెల 31 నుంచి ఏప్రిల్ 4 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మార్చి 31న అంకురార్పణం, ధ్వజారోహణం, రాత్రి కల్యాణ మహోత్సవం, ఏప్రిల్ 1న హనుమంతోత్సవం, 2న గరుడోత్సవం, 3న రథోత్సవం, 4న వసంతోత్సవం, రాత్రి పాన్పుసేవ, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

ఆధార్ నమోదుకు స్పెషల్ డ్రైవ్

గోపవరం : 0-5 సంవత్సరాలలోపు పిల్లలకు ఆధార్ నమోదు చేసుకునేందుకు సోమవారం నుంచి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ హరినారాయణ తెలిపారు. గోపవరం సచివాలయంలో ఉన్న ఆధార్ సెంటర్‌కు వెళ్ళి 0-5 సంవత్సరాలలోపు పిల్లలందరికీ ఆధార్ నమోదు చేయించుకోవాలన్నారు. అనంతరం బేతాయపల్లె, కాలువపల్లె గ్రామ పంచాయతీలకు సంబంధించి ఆధార్ నమోదుకు స్పెషల్ డ్రైవ్ ఉంటుందని, ఈ అవకాశాన్ని పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అసత్య ఆరోపణలు సరికాదు

ప్రవీణ్‌కుమార్‌రెడ్డిపై మండిపడ్డ కౌన్సిలర్లు

ప్రొద్దుటూరు : అసత్య ఆరోపణలతో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ప్రతిష్టను దిగజార్చలేవని ప్రొద్దుటూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డిపై కౌన్సిలర్లు మండిపడ్డారు. ఆదివారం మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిలర్లు భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, గరిశపాటి లక్ష్మీదేవి మాట్లాడుతూ ప్రొద్దుటూరు నియోజకవర్గ టీడీపీ టికెట్ కోసం ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎమ్మెల్యే క్రాస్ ఓటింగ్ చేయించారన్న ప్రవీణ్ కుమార్‌రెడ్డి వ్యాఖ్యలను వారు తీవ్రంగా ఖండించారు.

టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అంటేనే ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అసహనం వ్యక్తం చేస్తారని తెలిపారు. ఎందుకంటే ప్రజలను మోసం చేయడమే అజెండా పెట్టుకున్న వ్యక్తి చంద్రబాబు అన్నారు. అలాంటి వ్యక్తి పార్టీలో చేరి ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తాడని మతిభ్రమించి మాట్లాడుతున్నావా ప్రవీణ్ అని ప్రశ్నించారు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీలో సీనియర్ నాయకుడిగా గుర్తింపు పొందిన ఎమ్మెల్యే రాచమల్లుకు టీడీపీ టికెట్ ఆశించే ఖర్మ పట్టలేదన్నారు. పట్టణంలో విక్రయాలు జరుగుతున్న బయో డీజిల్‌లో ఎమ్మెల్యే రాచమల్లు కుటుంబ పాత్ర ఉందని ఆరోపణలు చేయడం ప్రవీణ్ చౌకబారు రాజకీయాలకు నిదర్శనమన్నారు. సమావేశంలో 11వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కసిరెడ్డి మహేశ్వర్‌రెడ్డి, ద్వార్శల గురునాథరెడ్డి పాల్గొన్నారు.

రంగస్థల కళలను ప్రతిఒక్కరూ ఆదరించాలి

బద్వేలు అర్బన్ : ఎన్నో వందల సంవత్సరాల చరిత్ర కలిగిన రంగస్థల కళలు అంతరించిపోకుండా ప్రతిఒక్కరూ ఆదరించాలని జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా ఆలిండియా కళారంగం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక మైదుకూరురోడ్డులోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నాటకమనేది సమాజంలోని సమస్యలను ప్రతిబింబిస్తూ వారిలో చైతన్యాన్ని కలిగించే ప్రచార సాధనం వంటిదన్నారు. ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమి డైరెక్టర్ బండారు లక్ష్మీదేవిసూర్యనారాయణ మాట్లాడుతూ ముఖ్యంగా నేటి యువతరానికి, సమాజానికి సందేశాత్మకమైన సమాచారాన్ని చేరవేయడానికి ఇటువంటి కళలను ప్రజల్లోకి వెళ్ళేలా చూడాలని కోరారు. అనంతరం ముఖ్యఅతి



కళాకారులకు గుర్తింపు కార్డులు అందజేస్తున్న దృశ్యం

థులను సన్మానించడంతో పాటు కళాకారులకు గుర్తింపు కార్డులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ హెచ్.వెంకటసుబ్బయ్య, ఆలిండియా కళారంగం వ్యవస్థాపక అధ్యక్షులు మాడుగులసుధీర్, జిల్లా అధ్యక్షులు బద్వేలుర వితేజ, ఉపాధ్యక్షులు పోలిరెడ్డి, చెంచురెడ్డి, సి.రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటుకు ముందుకు రావాలి

బద్వేలు అర్బన్ : ఎండల తీవ్రత ఎక్కువ అవుతున్న నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వ్యాపారస్తులు చలివేంద్రాల ఏర్పాటుకు ముందుకు రావాలని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర నాయకులు దేవసాని ఆదిత్యరెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డిలు తెలిపారు. స్థానిక సిద్ధవటం రోడ్డులోని ఎస్సీ వసతిగృహం సమీపంలో శ్రీమహాలక్ష్మి గోదాదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్వాహకులు వల్లంకొండ వెంకటరమణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం వారు ప్రారంభించారు. కార్యక్రమంలో సివిల్‌సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ సుందర్ రామిరెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్లు గోపాలస్వామి, సాయికృష్ణ, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ సుబ్బారెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి, అర్బన్ సీఐ



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర నాయకులు, మున్సిపల్ చైర్మన్

వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ కన్వీనర్ యద్దారెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు పి.వి.ఎన్.ప్రసాద్, ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కె.వి.సుబ్బారావు, ఆయా వార్డుల కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే రాచమల్లు

ప్రొద్దుటూరు : పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఆదివారం సాయంత్రం స్థానిక ఖాదర్ హుస్సేన్ మసీదులో ముస్లిం సోదరులు ఇచ్చిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్లిం మత పెద్దలతో కలసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఇఫ్తార్ విందు స్వీకరించారు.



ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

జోరుగా కుసుమ పంట నూర్పిళ్లు



కుసుమ పంటను మిషన్‌తో నూర్పిడి చేస్తున్న దృశ్యం

రాజుపాళెం : మండలంలోని పలు గ్రామాల్లో తెల్లకుసుమ పంట నూర్పిళ్లు జరుగుతున్నాయి. ఈ ఏడాది దిగుబడులు బాగా తగ్గిపోయాయని, ఎకరాకు 1 నుంచి 3 క్వింటాళ్ల మాత్రమే దిగుబడి వస్తోందని రైతులు పేర్కొంటున్నారు. దీంతో తీవ్రంగా నష్టపోతున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేశారు. గతేడాది ఎకరాకు 4 నుంచి 7 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చిందని, ధర కూడా బాగా ఉండేదని చెప్పారు. ప్రస్తుతం క్వింటాలు తెల్లకుసుమలు రూ.3500 నుంచి రూ.3700 ధర పలుకుతున్నాయని వ్యాపారులు



తెల్లకుసుమలు

తెలిపారు. మండల వ్యాప్తంగా 200 ఎకరాలకుపైగా ఈ పంట సాగైనట్లు రైతులు తెలిపారు.

వర్షానికి దెబ్బతిన్న నూగు పంట..

వీరపునాయునిపల్లె : మండలంలోని తలపనూరు గ్రామంలో నూగు పంట శనివారం రాత్రి గాలీ వానకు పూర్తిగా దెబ్బనిండి. తలపనూరు గ్రామానికి చెందిన 5 మంది రైతులకు చెందిన 20 ఎకరాల్లో సాగు చేసిన పంటను నూర్పిడి చేసేందుకు కుప్పలు వేసిన నూగు పంట పూర్తిగా దెబ్బతిని మొలకలు రావడం జరిగిందని రైతులు వాపోతున్నారు. దీంతో దాదాపు రూ.60 లక్షలు నష్టపోయామన్నారు.



మొలకెత్తిన నూగుపంట

ప్రభుత్వం ఆదుకోవాలని లేకపోతే ఆత్మహత్యలే శరణ్యమని రైతులు అంటున్నారు.

వైద్య సేవల్లో రాష్ట్రం దేశానికే ఆదర్శం

- ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా
- సీఎంఆర్ఎఫ్ కింద రూ.18.28 లక్షల పంపిణీ

కడప సెవెన్‌రోడ్స్: పేదలకు వైద్య సేవలు కల్పించడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా అన్నారు. ఆదివారం తన కార్యాలయంలో కడప నియోజకవర్గానికి చెందిన నలుగురు వ్యక్తులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచుట మంజూరైన రూ. 18.28 లక్షల చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఇందులో ఒకరికి 8 లక్షల 33 వేలు, మరొకరికి రూ. 8 లక్షలు, ఇంకో వ్యక్తికి రూ. 1.20 లక్షలు, మరో వ్యక్తికి రూ. 75 వేలు చొప్పున పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంజద్



చెక్కులు అందుకున్న వారితో ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా

బాషా మాట్లాడుతూ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రారంభించిన ఆరోగ్యశ్రీ పథకాన్ని తర్వాత వచ్చిన పాలకులు నీరుగార్చారని విమర్శించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఆ పథకాన్ని బలోపేతం చేశారన్నారు. సుమారు 3400 వ్యాధులను ఆరోగ్యశ్రీ పరిధిలోకి చేర్చారన్నారు. వైద్య ఖర్చులు రూ. 1000 దాటితే ప్రభుత్వమే భరిస్తుందన్నారు. హైదరాబాదు, చెన్నై, బెంగుళూరులోని రెఫరల్ ఆస్పత్రుల్లో వైద్య సేవలు ఆరోగ్యశ్రీ కింద పొందేందుకు అవకాశం కల్పించామన్నారు. సీఎంఆర్ఎఫ్ కింద వందలాది మందికి కోట్లాది రూపాయలు పంపిణీ చేశామన్నారు. గతంలో కేన్సర్ రోగులకు రూ. 2 లక్షల వరకు మాత్రమే ఇచ్చేవారని, ఇప్పుడు పూర్తి ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు కూడా ప్రభుత్వం ఖర్చు పెడుతోందన్నారు. గ్రీన్ ఛానల్ ద్వారా బిల్లులు ఎప్పటికప్పుడు చెల్లిస్తున్నామని వివరించారు. రోగికి ఓవైపు వైద్య సేవలు అందిస్తూనే కుటుంబ పోషణకు ప్రతినెలా రూ. 5 వేలు అందజేస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రజలు ఆశీస్సులు అందజేయాలని కోరారు.

నేడు ఓబుళరెడ్డిపేటలో వైద్య శిబిరం

చాపాడు : మండలంలోని పెద్దగురువళూరు గ్రామ సచివాలయ పరిధిలోని ఓబుళరెడ్డిపేటలో సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి రాజేష్ కుమార్ తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ గ్రామంలోని ప్రజలకు వైద్య పరీక్షలు చేయటం జరుగుతుందని, ఇదే క్రమంలో ఇళ్లకే పరిమితమైన దీర్ఘకాలిక రోగులను పరీక్షించి అవసరమైన మందులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

నిబంధనలకు విరుద్ధంగా ఫీజుల వసూళ్లు

వైవీయూ: విద్యార్థుల నుంచి అధిక పరీక్ష ఫీజులు వసూలు చేస్తున్న లా కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.ఆర్. నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం కడప నగరంలోని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని న్యాయకళాశాలలు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. రూ.10 నుంచి రూ.13 వేలు ఫీజులు కేటాయిస్తే కళాశాలల యాజమాన్యాలు ఇష్టానుసారంగా వసూలు చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సోనీ, దీప పాల్గొన్నారు.

రక్తదానం

కడప కల్చరల్ : కడప నగరంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకులో ఆదివారం సినీ నటులు రామ్‌చరణ్‌తేజ్ అభిమానులు రక్తదానం చేశారు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని జిల్లా చిరంజీవి యువత అధ్యక్షులు రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అతిథి దినేష్ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. చిరంజీవి అభిమానులు చిన్నా, వెంకటసురేంద్ర, నాగేంద్ర, దేవకుమార్, రాజేష్, చంటి, జానీకుమార్ పాల్గొన్నారు.

మోటారు వాహనాలకు వేలం

వీరపునాయునిపల్లె : స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో పట్టుబడిన మోటారు వాహనాలను ఈ నెల 31వ తేదీ ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ రాజా రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొను వారు తమ వెంట ఆధార్ కార్డులు తీసుకుని రావాలని కోరారు.

పురపాలక విద్య ముసాయిదా రూల్స్‌ను సవరించాలి

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వం ప్రతిపాదించిన మున్సిపల్ ఎడ్యుకేషన్ సర్వీస్ యూనిఫైడ్ డ్రాఫ్ట్ రూల్స్ చాలా లోపభూయిష్టంగా ఉన్నాయని వాటిని సవరించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర మున్సిపల్ కమిటి కన్వీనర్ రవిశంకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం కడప ఎస్టీయూభవన్‌లో మున్సిపల్ ఎడ్యుకేషనల్ సర్వీస్ యూనిఫైడ్ డ్రాఫ్ట్ రూల్స్‌పై ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ టీచర్ల ఉమ్మడి సర్వీసు రూల్స్‌కు జిల్లాలోని కార్పొరేషన్ ఒక యూనిట్‌గా, మున్సిపాలిటీ ఒక యూనిట్‌గా పరిగణించాలన్నారు. మున్సిపాలిటీలలో అర్బన్ ఎంఈఓ పోస్టులను, అర్బన్ డీవైఈఓ పోస్టులను మంజూరు చేసి ఆయా మున్సిపాలిటిలలోను, కార్పొరేషన్లలోనూ సీనియారిటీ,రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటిస్తూ పురపాలక ఉపాధ్యాయులతోనే భర్తీ చేయాలన్నారు. వీటన్నింటిని ప్రభుత్వం పరిశీలించాలని కోరారు.

చలో పార్లమెంట్‌ను జయప్రదం చేయండి

కమలాపురం : బీజేపీ కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఏప్రిల్ 5న జరిగే చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనువాసులురెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం కమలాపురంలో ఆయన ఇతర నాయకులతో కలసి చలో పార్లమెంటు వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న మోదీ నాయకత్వంలో నడుస్తున్న బీజేపీ ప్రభుత్వం కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని మండిపడ్డారు. కార్మికులను యజమానులకు బానిసలుగా చేసే విధంగా కార్మిక చట్టాలను ప్రభుత్వం మార్పు చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న జరపతలపెట్టిన చలో పార్లమెంట్ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరై జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఆర్.లక్ష్మీదేవి, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ నాయకులు కుష్మావతి, ఉమాదేవి, సుబ్బలక్ష్మీ, జిల్లా కమిటీ సభ్యులు సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గ ఎంపిక

కడప ఎడ్యుకేషన్: కడపజిల్లా ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్-1938) నూతన కార్యవర్గాన్ని ఆదివారం కడపలోని ఎన్‌జీఓ హోంలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఎన్నుకున్నారు. ఇందులో జిల్లా నూతన అధ్యక్షుడిగా వెంకటేశ్వరరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వీవీ రామాంజనేయులరెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా సాయి శివారెడ్డి, అసోసియేషన్ అధ్యక్షుడిగా బత్తల రాజు, ఉపాధ్యక్షుడిగా చంద్ర శేఖర్‌రెడ్డి, ఖాశీంవల్లి, నాగభూషణం, నారాయణస్వామి ఎన్నికయ్యారు. వీరితో పాటు పలువురిని కార్యదర్శులుగా ఎన్నుకున్నారు.